క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



సహకార సంఘంలో ఉన్న విత్తనాల బస్తాలు

నగరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏడీపీ 37 వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కార్యదర్శి తులసి పిళ్లై తెలిపారు. 30 కేజీల బస్తా రూ.960కు లభిస్తుందన్నారు. 10–26–26 ఎరువులు, డీఏపీ, యూరియా కూడా అందుబాటులో ఉందని.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు వ్యవసాయ సహకార సంఘాన్ని సంప్రదించాలని కోరారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



ఎస్‌కేఆర్‌పురంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

పాలసముద్రం: మండలంలో పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసన్ తెలిపారు. తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 3893 మంది పింఛన్లు పొందుతుండగా ఇప్పటి వరకు 3,699 మందికి పంపిణీ చేశామని తెలిపారు.

వేగవంతంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీ 12వ వార్డులోని అమరంకండ్రిగ గ్రామస్తుల సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని తూర్పు వీధిలో 40 ఏళ్లుగా డ్రైనేజీ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను వార్డు కౌన్సిలర్ ఎస్.బాలాజీ పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షలను మంజూరు చేయించారు. ఫలితంగా గ్రామంలో 150 మీటర్ల మేర డ్రైనేజీ పనులు జోరుగా జరుగుతున్నాయి. శుక్రవారం పనులను కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లి సమీపంలోని శిలగొంది మూల ప్రాంతంలో కామక్షమ్మ చెరువు పక్కన శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతనికి సుమారు 40 ఏళ్లు ఉంటా యని సీఐ రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

తిరుపతి కల్చరల్: అన్నమయ్య సర్కిల్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వెనుకనున్న ప్రభుత్వ గ్రేడ్ –1 శాఖా గ్రంథాలయంలో ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నట్టు ఉయ్ సపోర్టు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు తహసున్నీషా తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. యోగా ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు.

ముగిసిన టీటీడీ అధికారుల కేరళ పర్యటన

తిరుపతి తుడా: ఆయుర్వేద వైద్యంపై అధ్యయనం చేసేందుకు టీటీడీ అధికారులు మూడు రోజులు కేరళలో చేపట్టిన పర్యటన గురువారం ముగిసింది. జేఈవో సదా భార్గవి, సీవీఎస్‌వో శేషశైలేంద్ర, ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ గురువారం సాయంత్రం తిరువనంతపురం సమీపంలోని కోవళం వద్ద గల సోమతీరం ఆయుర్వేద గ్రామాన్ని సందర్శించారు. గుడిసెల తరహాలో నిర్మించిన ఇన్ పేషెంట్ గదులను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది విధులు, బాధ్యతల గురించి తెలుసుకున్నారు. ఫార్మసీ, పరిశోధనశాలలను పరిశీలించి వాటి నిర్వహణను ఆరా తీశారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదాలు నివారించాలి

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీపీటీవో చెంగల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం తిరుమల ఘాట్ రోడ్డులో తిరుగుతున్న బస్సు సర్వీసులకు చెందిన డిపో మేనేజర్లతో సమావేశమయ్యారు. ప్రమాదాలకు దూరంగా ఉంటున్న డ్రైవర్లను మాత్రమే తిరుమల ఘాట్‌రోడ్డులో పంపించాలని సూచించారు. బస్సుల కండిషన్‌ను మెకానిక్స్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ నరసింహులు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

ఆదర్శంగా జీడీనెల్లూరు అభివృద్ధి

- నియోజకవర్గంలో రూ.62 కోట్లతో పనులు
- 74 ఆలయాల నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని జిల్లాలో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొటార్వేడులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని సర్పంచ్‌లు సరళ, శీలారాణితో కలిసి ప్రారంభించారు. అదే విధంగా రూ.20 లక్షలతో నిర్మించనున్న రెండు హిందూ ఆలయాలకు మంత్రి భూమి పూజ చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండలానికి వచ్చిన నారాయణస్వామికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీడీనెల్లూరు వెనుకబడిన దళిత నియోజకవర్గమని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దత్తత తీసుకున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించి పులివెందల తరహాలో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. పెనుమూరులో కనికిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, కార్వేటినగరం మండలం ఆళత్తూరు గ్రామంలోని వరద వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 74 హిందూ ఆలయాల నిర్మాణానికి రూ. 7.40 కోట్లు టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. అదే విధంగా కార్వేటినగరం స్కంధ పుష్కరిణిలో నిరాలిమండపం, కల్యాణ మండపంలో అదనపు గదుల నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరు చేయించామన్నారు. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని కలికిరిండ్లు గ్రామం నుంచి ఎల్ఆర్ పేట వరకు రూ. 20 కోట్లు వెచ్చించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. రూ.33 కోట్లతో రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కుమార్తె కృపాలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర మొదలియార్ సంఘం డైరెక్టర్ సుగుణ, ఎంపీటీసీ సభ్యురాలు విమల, సచివాలయ కన్వీనర్ వెంకటేష్, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు ధనం జయవర్మ, ధనంజయరెడ్డి, కార్తిక్‌రెడ్డి, పట్నం ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయాదవ్, గోపి, విశ్వనాథరెడ్డి, చందురాజు, విజయులురెడ్డి, వెంకటరత్నం, కందయ్య, ఆలయాల స్థల దాతలు హరిదాసు, ధర్మయ్య, డీఈ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్ మురళీ పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం



మెగా జాబ్ మేళాలో మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

- మెగా జాబ్ మేళాలో 193 మందికి ఉద్యోగాలు
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



హాజరైన యువతీ యువకులు

పుత్తూరు రూరల్: నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వృత్తి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. యువతకు విద్య, ఉద్యోగం రెండింటినీ అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారన్నారు. తిరుపతిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఎంతో ఉపయోగముంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి, తర్వాత యువతను నడిరోడ్డుపై వదిలేశారని గుర్తు చేశారు. నేటి ప్రభుత్వం నాడు–నేడు వంటి పలు పథకాలతో విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తోందని చెప్పారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ తరగతి గదులను ప్రారంభించారు. 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు 296 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 193 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, స్కిల్ కోఆర్డినేటర్ టి.నరసింహులు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గుణశేఖర్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ పద్మజ, ఎంపీడీఓ ఇందిర, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, స్కిల్ మెంటార్ రసూల్ పాల్గొన్నారు.

సింహ వాహనంపై వెంకన్న వైభవం





సింహ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి, ముత్యపు పందిరి వాహనంపై గోవిందుడు

వడమాలపేట: అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకం (ఏకాంతం) అలంకారం, మొదటి గంట అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ వేంటేశ్వరుడు సింహ వాహనంపైకి వేంచేసి శ్రీనరసింహస్వామి అలంకారంలో ఉదయం 8 గంటల నుంచి 9 వరకు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శుద్ధి, రాత్రి కైంకర్యాలు నిర్వహించి ఊంజల్ సేవ నిర్వహించారు.

ముత్యపు పందిరిపై గోవిందుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటల నుంచి 8 వరకు గోవిందుడు ముత్యపు పందిరి వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. వాహన సేవ అనంతరం స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు పాల్గొన్నారు.

తిమ్మాపురం లేఅవుట్ యజమానికి నోటీసు



తిమ్మాపురంలోని లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీ 2వ వార్డులోని తిమ్మాపురం గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన అక్రమ లేఅవుట్ యజమానికి నోటీసు జారీ చేసినట్లు కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఉన్న అక్రమ లేఅవుట్లను గుర్తించి అందరికీ నోటీసులు జారీ చేయాల్సిందిగా టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేవలం 10 నుంచి 15 అడుగుల రోడ్లతో లేఅవుట్లు వేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అన్ని లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం

పాలసముద్రం: పాడిపశువులకు వచ్చే వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి భానుప్రసాద్ అన్నారు. శుక్రవారం బాలక్రిష్ణాపురం పంచాయతీలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏసీఓ ఈ.మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరెడ్డి మాట్లాడుతూ.. పాడి పశువులకు గాలికుంటు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. టీకాలు వేయించాలని తెలిపారు. టీకాలు వేయడం వల్ల పాలు తగ్గిపోతుందని కొందరు అపోహ పడుతుంటారని.. ఇలాంటి వాటిని నమ్మవద్దని కోరారు. 25 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేసి పిడుగు మందులు పిచికారీ చేశారు. అనంతరం తక్కువ ధరకు పాడి రైతులకు క్యాల్షియం, మినరల్‌మిచ్చర్ అందించారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ అనిత అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా ప్రతినిధులతో అధికారులు కలిసి పని చేసినప్పుడే ఆ గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లోపించిందని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, జగనన్న కాలనీల్లో రెండేళ్లుగా పైప్‌లైన్ల కోసం అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. దీంతో స్పందించిన విద్యుత్ ఏఈ రాజా ఒక్క లేఅవుట్‌లో తప్పా అన్ని లేఅవుట్లలో విద్యుత్ పనులు పూర్తి చేశామని తెలిపారు. బాలగంగనపల్లె పరిధిలో కొత్త సబ్‌స్టేషన్ కోసం స్థలం ఎంపిక చేశామని.. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. తహసీల్దార్ ఇన్బనాథన్ మాట్లాడుతూ.. జూన్ నెల నుంచి నిత్యావసర సరుకులతో పాటు రాగులు, జొన్నలు పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన మామిడి ధర ఇవ్వకుండా ఫ్యాక్టరీ యజమానులు ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, పెద్ద కాల్వ సర్పంచ్ ఏకాంబరం సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఉద్యాన శాఖ అధికారి బాలాజీ అది తమ స్థాయిలో లేదని.. ధర విషయంలో ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యి నిర్ణయిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ పాల్గొన్నారు.

కోలాహలంగా బలిబండి



కొల్లాగుంటలో బలి బండితో వెలుతున్న భీముని వేషధారి

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి వార్షిక మహా భారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బలి బండి ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కులున్న భక్తులు అలంకరించిన ఎద్ల బండ్లతో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. భీముని వేషధారి ఎద్ల బండిపైకి ఎక్కి బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని భక్తులకు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ద్రౌపదీ అమ్మవారితో పాటు భీమ, అర్జున, నకుల, సహదేవులు, శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బలి బండి ఉత్సవానికి ఉభయదారులుగా స్వర్గీయ షణ్ముగం కుమారులు గోపీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

టపాకాయల గోడౌన్ తనిఖీ



మహారాజపురంలో టపాకాయ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న సీఐ

విజయపురం (నగరి): మండలంలో పేలుడు పదార్థాల తయారీ నిషేధమని, ఎక్కడైనా అక్రమంగా తయారు చేస్తున్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తప్పవని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మహారాజపురంలోని టపాకాయల గోడౌన్, మహారాజపురం, పన్నూరు సబ్‌స్టేషన్‌లో టపాకాయలు విక్రయించే షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో టపాకాయలు తయారు చేయడానికి ఎవరికీ లైసెన్స్ లేదన్నారు. తయారు చేయాలన్నా, విక్రయించాలన్నా లైసెన్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా టపాకాయలు తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి నాడు విక్రయించి అందులో మిగిలిన టపాకాయలను షాపుల్లో పెట్టుకుని విక్రయించడం కూడా చట్టరీత్యా నేరమన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ లోకనాథం, సిబ్బంది ఉన్నారు.

నేత్రపర్వంగా 'కంచి గరుడసేవ'



గరుడ వాహన సేవలో టీటీడీ అధికారులు



కంచి గరుడ సేవలో స్కౌట్ అండ్ గైడ్స్ సేవలు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఆలయంలో శుక్రవారం కంచి గరుడసేవను వైభవంగా నిర్వహించారు. గరుడ వాహనంపై దేదీప్యమానంగా ఆశీనులైన స్వామివారిని మాడ వీధుల్లో ఊరేగించారు. టీటీడీ ఏర్పాటు చేసిన తూర్పుగోదావరి జిల్లా యువకుల కోలాటాలు, రాజమండ్రి వారి పండరి భజన బృందాలు, బ్యాండు వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో కంచి గరుడ వాహనంపై కరియమాణిక్యస్వామి విహరించారు. స్వామివారిని దర్శించుకోవడానికి మాడవీధుల్లో భక్తులు బారులు తీరారు. ఫలపుష్పాలు, కొబ్బరి కాయలు సమర్పించి కర్పూర హారతులు సమర్పించారు.

కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్, కిషోర్‌బాబు, జానకి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ నేతృత్వంలో స్కౌట్ విద్యార్థులు, ఆలయ సేవకులు పాల్గొన్నారు.

కంచి గరుడ సేవలో స్కౌట్ సేవలు

పుత్తూరు రూరల్: పట్టణంలో శుక్రవారం జరిగిన కంచి గరుడ సేవలో పుత్తూరుకు చెందిన స్కౌట్ అండ్ గైడ్స్ సభ్యులు సేవలందించారు. శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి గరుడ సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వాహనానికి ఇరువైపులా భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తూ స్కౌట్ సభ్యులు సేవలు అందించారు. ఆలయ అధికారి వెంకటరమణ వీరి సేవలను కొనియాడారు. స్కౌట్ మాస్టర్లు, ఏ.వెంకటేశ్వర్లు, దాము, గైడ్ కెప్టెన్ రోజా, రోవర్ స్కౌట్ లీడర్ రమేష్, రేంజర్ లీడర్ భువనేశ్వరి, గీతిక, లేఖశ్రీ, హేమాద్రి పాల్గొన్నారు.



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు



బ్యాండు వాయిస్తున్న కళాకారులు



భజనలు చేస్తున్న కళాకారులు

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ మిట్టదళితవాడ గ్రామ దేవతకు శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంబలి సమర్పించారు. ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పిండి దీపాలు, అంబలి, పూజా సామగ్రితో పంబ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు ఏకాంబరం అమ్మవారిని సుందరంగా అలంకరించి దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం మహిళలు అమ్మవారికి పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారికి అంబలి, పిండి దీపాలు తీసుకొస్తున్న మహిళలు